సంఘాల్లో పారదర్శకతకు చర్యలు

● మెప్మా పీడీ వై.సురేశ్‌రెడ్డి



కడప ఎన్టీఆర్‌సర్కిల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల్లో పారదర్శకత తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మెప్మా పీడీ వై.సురేశ్‌రెడ్డి పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల ప్రొఫైల్‌ను యాప్‌లో పొందుపరిచి సమగ్ర సమాచారం అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. అదేవిధంగా సంఘాల్లో అక్రమాలు జరగకుండా ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్ రూపొందించామన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు మాట్లాడారు.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని స్వయం సహాయక సంఘాలున్నాయి?
జవాబు: కడప నగరపాలక సంస్థతో పాటు జిల్లాలోని మున్సిపాలిటీలు, నగర పంచాయతీల పరిధిలో ఇప్పటి వరకు 14,446 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఇందులో 1,53,529 మంది సభ్యులుగా ఉన్నారు. వీరికి 499 మంది ఆర్పీలు సేవలందిస్తున్నారు.

ప్రశ్న: సంఘాల్లో అక్రమాలు జరగకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?
జవాబు: దాదాపు గత ఐదేళ్లుగా పలు సంఘాలకు సంబంధించిన రికార్డులు అప్‌డేట్ చేయలేదు. దీంతో కొంతవరకు గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితులకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్ రూపొందించింది. సంఘాల వివరాలన్నీ సమగ్ర సమాచారంతో ఈ యాప్‌లో పొందుపరుస్తాం. దీనివల్ల భవిష్యత్తులో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు సులభతరమవుతుంది.

ప్రశ్న: జీవనోపాధి కల్పనకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?
జవాబు: స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు సూక్ష్మ ప్రణాళిక ద్వారా మెరుగైన జీవనోపాదులు కల్పించేందుకు ప్రభుత్వం తీసుకువస్తున్న యాప్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇందులో సభ్యుల ఆర్థిక, సామాజిక స్థితిగతులు తెలుసుకోవడం వల్ల వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

ప్రశ్న: వ్యాపారాల పట్ల శిక్షణ ఇస్తున్నారా ?
జవాబు: ఎన్‌బీయూ (నైబర్‌వుడ్ బిజినెస్ యూనిట్)లలో భాగంగా సంఘాల్లోని సభ్యులను గుర్తించి వారికి శిక్షణ ఇస్తున్నాము. దాదాపు 4 వేల మందిని ఈ ఆర్థిక సంవత్సరంలో గుర్తించాలనేది లక్ష్యం. అలా గుర్తించిన వారికి ఇంటి సమీపంలోనే జీవనోపాదులు కల్పించేందుకు టైలరింగ్, బ్యూటీషియన్, బిస్కెట్ల తయారీ లాంటి వ్యాపారాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: మహిళా సంఘాల ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేందుకు ఏ విధమైన చర్యలు చేపడుతున్నారు ?
జవాబు: మహిళా సంఘాల సభ్యులు తయారు చేసే ఆహార ఉత్పత్తులు, ఇతర ఉత్పత్తులకు సంబంధించి మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాల కల్పనకు ఈ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. కార్పొరేట్ సంస్థల తరహాలో 'మెప్మా వావ్' అనే పేరుతో ఆన్‌లైన్ బిజినెస్‌కు కూడా చర్యలు తీసుకోవాలనే దిశగా మెప్మా ఉన్నతాధికారులు ఆలోచనలు చేస్తున్నారు.

డయల్ యువర్ కలెక్టర్ సమయంలో మార్పు

కడప కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇప్పటివరకు ప్రతి సోమవారం ఉదయం నిర్వహించే డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం సమయంలో మార్పు చేశారు. ఉదయం 9-30 నుంచి 10-30 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని 9-30 నుంచి 10 గంటల వరకు మాత్రమే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ మార్పును గమనించి 08562-244437 ల్యాండ్‌లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలు తెలియజేయవచ్చని ఆ ప్రకటనలో వివరించారు.

పులివెందులలో పేకాట జోరు



● రహస్య స్థావరాల్లో శిబిరాలు ● చేతులు మారుతున్న లక్షలాది రూపాయలు ● ఇన్‌ఫార్మర్ల సాయంతో ఎస్కేప్ ● ఇతర ప్రాంతాల నుంచి జూదరుల రాక ● ఇద్దరు వ్యక్తుల కనుసన్నల్లో నిర్వహణ

పులివెందుల అంటేనే రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలియనివారు లేరు. ఈ ప్రాంతవాసులు ఇద్దరు ముఖ్యమంత్రులుగా పనిచేయడంతో ఇక్కడ ఏది జరిగినా సంచలనంగా మారుతుంది. ఇక్కడ జరగని అసాంఘిక కార్యక్రమాలంటూ లేవు. గత వైసీపీ పాలనలో పేకాట, మట్కా, జూదం మూడు పువ్వులు.. ఆరుకాయలుగా సాగాయి. పోలీసులు కూడా చూసీచూడనట్లు వ్యవహరించడంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా కొనసాగింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వీటికి అడ్డుకట్ట పడడం లేదు. పులివెందుల సబ్ డివిజను పరిధిలోని పలు ప్రాంతాల్లో పేకాట విచ్చలవిడిగా సాగుతోంది. చాపకింద నీరులా రోజురోజుకూ విస్తరిస్తూ పోలీసులకు సవాల్‌గా మారుతోంది. జూద కేంద్రాల్లో రోజూ లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. నిర్వాహకులు ఇన్‌ఫార్మర్ల సాయంతో తరచూ స్థావరాలు మారుస్తూ గోప్యంగా నడుపుతున్నారు. ఇక్కడికి ఇతర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో వచ్చి జూదం ఆడుతూ జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. ఇద్దరు వ్యక్తుల కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతోందని తెలుస్తోంది.



పులివెందులటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పులివెందుల సబ్ డివిజను పరిధిలోని పలు ప్రాంతాల్లో పేకాట విచ్చలవిడిగా సాగుతుందన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. వైసీపీ, టీడీపీకి చెందిన చోటా నాయకులు పేకాట స్థావరాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. స్థానికులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో జూదరులు వస్తున్నట్లు సమాచారం. వారికి పేకాట నిర్వాహకులు ఫోను ద్వారా సమాచారం ఇస్తూ కేంద్రాలకు రప్పిస్తున్నారు. ఎప్పటికప్పుడు స్థావరాలు మారుస్తూ ఆ సమాచారాన్ని ఫోను ద్వారా జూదరులకు తెలుపుతూ అవసరమైతే లొకేషన్ కూడా షేర్ చేస్తున్నట్లు తెలుస్తుంది. దీంతో జూదరులు స్థావరాలకు సులభంగా చేరుకుంటున్నారు. పోలీసులు ఎంత రహస్యంగా పక్కా సమాచారంతో దాడులు నిర్వహిస్తున్నా ఇన్‌ఫార్మర్ల ద్వారా తెలుసుకుని జూదగాళ్లు తప్పించుకుంటున్నారు. పులివెందుల పాత కదిరి రోడ్డు కొండ శివారు ప్రాంతంలో వాగు పరివాహక ప్రాంతాలు ఎంచుకుని పేకాట ఆడుతున్నారు. పేకాట ఆడే వారికి కొందరు నగదు అక్కడే అప్పుగా ఇచ్చి అధిక వడ్డీలు వసూలు చేసుకుంటున్నారు. జూదంతో పాటు మద్యానికి అలవాటు పడి ఆర్థికంగా నష్టపోతూ ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. ఇద్దరు వ్యక్తుల నిర్వహణలో పేకాట జరుగుతున్నట్లు సమాచారం. ఆ వ్యక్తులు అన్ని రకాల సౌకర్యాలు చేస్తున్నట్లు తెలిసింది. నిత్యం లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నట్లు తెలిసింది. పోలీసులు అప్పుడప్పుడూ దాడులు చేస్తున్నా పెద్ద మొత్తంలో పట్టుబడడం లేదు. కొంతమంది లోపాయికారిగా వారికి సమాచారం అందిస్తుండడంతో వీరి పేకాట స్థావరాలకు అడ్డూ అదుపు లేకుండా పోతుంది.

క్లబ్బుల్లో సాగుతున్న పేకాట

పులివెందుల పట్టణంలోని పాత గంగిరెడ్డి హాస్పిటల్ సమీపంలో ఉన్న లైసెన్సు రోటరీ క్లబ్ అలాగే డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న క్లబ్బుల్లో జోరుగా రమ్మీ సిండికేట్ ఆటలు సాగుతున్నట్లు సమాచారం. క్లబ్బుల్లో పేకాట నియంత్రించడంలో పోలీసు అధికారులు వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది. ఒకప్పుడు క్లబ్బుల్లో ఐదు, పది మంది మాత్రమే కనబడేవారు. ఇప్పుడు 20, 30 మంది వరకు క్లబ్బుల్లోనే కనబడుతూ మందు సేవిస్తూ పేకాట ఆడే పరిస్థితి పులివెందులలో నెలకొంది. పులివెందుల శివార్లలో ఎక్కడైనా మందు తాగుతున్నా, పేకాట ఆడుతున్నా పోలీసులు వారిని తీసుకెళ్లి కేసులు పెడుతున్నారు. పట్టణ నడిబొడ్డులో ఉన్న రెండు క్లబ్బుల్లో పేకాట ఆడుతూ మందు తాగుతున్నా వారిని పట్టించుకునే నాథుడు లేరు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎక్కడెక్కడ నిర్వహిస్తున్నారంటే..

పులివెందుల సబ్ డివిజను పరిధిలోని పట్టణ శివారు ప్రాంతాలతో పాటు పలు మండలాల్లో జూదం జోరుగా సాగుతోంది. పట్టణంలోని పలు లాడ్జీల్లో కూడా జూదం సాగుతున్నట్లు సమాచారం. పాత కదిరి రోడ్డు, శిల్పారామం బ్యాక్ సైడ్, గోటూరు రాతివనం, బ్రాహ్మణపల్లె తోటల్లో, మోటున్నూతలపల్లె కొండలు, ఆటోనగర్ ప్రాంతాల్లో గాజు ఫ్యాక్టరీ బ్యాక్‌సైడ్ జూదం జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. కొందరు దళారులను ఇన్‌ఫార్మర్లుగా ఏర్పాటు చేసి పేకాట ఆడిస్తున్నట్లు సమాచారం. రెండుమూడు చోట్ల ఇన్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకున్నారు. పోలీసులు దాడులకు బయల్దేరినా ఇన్‌ఫార్మర్లు రహస్యంగా సమాచారాన్ని చేరవేస్తుండడంతో జూదరులు తప్పించుకుంటున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో స్థావరాలు మార్చుకుని జూదం కొనసాగిస్తున్నట్లు సమాచారం.

సొమ్ము చేసుకుంటున్న వడ్డీ వ్యాపారులు

పేకాటకు అలవాటు పడి ఎంతో మంది ఆర్థికంగా చితికిపోయి కుటుంబాలను నాశనం చేసుకుంటున్నారు. పేకాట వల్ల కొంతమంది జీవితాలు నిలువునా ఆరిపోయాయి. కొంతమంది వడ్డీ వ్యాపారులు జూదరులకు అప్పులు ఇచ్చి ధనవంతులుగా మారుతున్నారు. జూదరుల బలహీనతలను వారు సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు వడ్డీ వ్యాపారులు నేరుగా పేకాట ఆడుతున్న ప్రాంతాలకు వెళ్లి, అక్కడే వేచి ఉండి డబ్బులు పోగొట్టుకున్న వారికి రోజువారి వడ్డీకి అప్పులు ఇచ్చి గుంజుతున్నారు. పోలీసులు పేకాట అరికట్టకపోతే కుటుంబాలు తీవ్రంగా నష్టపోయి రోడ్డుపాలు కాకతప్పదని ప్రజలు అంటున్నారు.

పేకాటపై కఠిన చర్యలు తీసుకుంటాం..



పులివెందుల సబ్ డివిజన్ పరిధిలో పేకాట ఆడినా, ఆడించినా కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే డివిజను పరిధిలోని అన్ని మండలాల్లో పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించాం. కేసులు నమోదు చేస్తున్నాం. క్లబ్బుల్లో కూడా పేకాట అరికట్టేందుకు కృషి చేస్తాం. రెండోసారి ఎవరైనా దొరికినా నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేసి రిమాండుకు పంపుతాం. పేకాట పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు కృషి చేస్తాం.

- మురళి, డీఎస్పీ, పులివెందుల

గ్యాంబ్లింగ్ ముఠా అరెస్టు

● రూ. లక్షా 80వేలు నగదు స్వాధీనం

అట్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రమైన లంకమల అభయారణ్యంలో వెలసిన రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం జూదం ఆడుతుండగా దాడి చేసి అరెస్టు చేసి నట్లు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించి వివ రాలు వెల్లడించారు. నంద్యాల టౌన్, పరిసర ప్రాంతాలకు చెందిన 18 మంది, బద్వేలు మండలం సిద్దుగారిపల్లె వాసులు ఇద్దరు ఆలయంలో జూదం ఆడుతున్నారన్న సమాచారంతో బద్వేలు సీఐ నాగభూషణ్, అట్లూరు ఎస్ఐ రామక్రిష్ణ, స్పెషల్ పార్టీ కలిసి దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.1.80 లక్షలు నగదు, ఆరు మద్యం బాటళ్లు, ఐచర్ వాహనం, 20 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. వీరిలో ఉపాధ్యా యు లు, అడ్వకేట్లు, పోలీసులు, టీచర్లు ఉన్నట్లు పోలీసుల రిపోర్టులో వెల్లడించారు. పుణ్యక్షేత్రాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.


20 మంది వైసీపీ కార్యకర్తలకు నోటీసులు

పులివెందులటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన కేసులో మరో 20 మందికి 41ఏ నోటీసులు జారీ చేసినట్లు డీఎస్పీ మురళీ పేర్కొన్నారు. ఆదివారం కడపకు చెందిన సునీత, నెల్లూరుకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డితో పాటు మరో 18 మందికి పోలీసులు నోటీసులు జారీ చేసి విచారణకు హాజరు కావాలని కోరారు. ఈ కేసులకు సంబంధించి రవీంద్రరెడ్డి వాంగ్మూలంతో 45 మందిని రిపోర్టులో చేర్చారు. ఇందులో భాగంగానే శనివారం 15 మందికి పోలీసులు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే.

వివేకా పీఏ క్రిష్ణారెడ్డి కేసులోనూ..

మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, సీబీఐ అధికారి రాంసింగ్‌పై వివేకా పీఏ క్రిష్ణారెడ్డి గతేడాది ప్రైవేటు కేసు వేశారు. ఇందులో సాక్ష్యాలుగా ఉన్న వైఎస్ మనోహర్‌రెడ్డి, ఈసీ సురేంద్రనాథరెడ్డి, వైసీపీ లాయర్ ఓబుల్‌రెడ్డి మరి కొందరిని విచారణకు రావాలని ఆదివారం పోలీసులు నోటీసులు జారీ చేశారు. దీనికి సంబంధించి రెండు వారాలు గడువు కావాలని వారు పోలీసులను కోరినట్లు సమాచారం.

చరిత్ర ఘనం.. నిర్వహణ శూన్యం



చెక్కు చెదరని రాతి కట్టడం




నల్లమల అడవుల్లోని దిగువమెట్ట, కంభం ప్రాంతం నుంచి సగిలేరు నది ప్రకాశం జిల్లా గిద్దలూరు మీదుగా ప్రవహిస్తుంది. ఈ నదిపై 125 ఏళ్ల క్రితం కాల్వలు, ప్రాజెక్టులు లేకపోవడంతో నీరంతా వృధాగా పెన్నానదిలో కలిసి సముద్రంలోకి వెళ్లేది. ఆనాటి బ్రిటీషు ప్రభుత్వం సుమారు రూ.4.6 లక్షల వ్యయంతో దిగువ తంబళ్లపల్లె వద్ద పెద్ద ఆనకట్ట ఎగువసగిలేరు ప్రాజెక్టు నిర్మించి.. దాని నుంచి పోరుమామిళ్ల చెరువుకు నీరందించేందుకు సుమారు 14 కి.మీ కాల్వ (పీటీ చానెల్) తవ్వారు. ఈ కాల్వ ద్వారా కలసపాడు, పెండ్లిమర్రి, ఓబులాపురం, అక్కిసిద్దుపల్లె, చింతలపల్లె చెరువు మీదుగా పోరుమామిళ్ల చెరువుకు సగిలేరు జలాలు చేరుతాయి. సుమారు 8వేల ఎకరాలకు సాగునీరు అందేది. దీని నిర్వహణను గాలికి వదిలేయడంతో కాల్వ అంతా పూడిక పేరుకుపోయి, కంపచెట్లు పెరిగిపోయాయి. దీంతో ఈ కాల్వలో వచ్చేనీరు తగ్గిపోయి వేలాది ఎకరాల్లో సాగుకు రైతులు అవస్థలు పడుతున్నారు.



ఆనకట్టకు ఏర్పాటు చేసిన గేట్లు

● దుస్థితిలో ఎగువ సగిలేరు ప్రాజెక్టు ● పూడిపోయిన పీటీ చానెల్ ● నీళ్లున్నా.. వచ్చే దారి లేక రైతుల అవస్థలు



ఎగువ సగిలేరు ప్రాజెక్టు ఆనకట్ట

కలసపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వరుస కరువుతో సతమతమవుతున్న బద్వేలు నియోజకవర్గంలోని కలసపాడు, పోరుమామిళ్ల ప్రాంత రైతులకు సాగు, తాగునీరు అందించేందుకు ఆనాటి బ్రిటీషు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కలసపాడు మండలం దిగువతంబళ్లపల్లె సమీపంలో సగిలేరు నదిపై 1896వ సంవత్సరంలో ఎగువ సగిలేరు ప్రాజెక్టు నిర్మించింది. రాతితో పెద్ద ఆనకట్ట కట్టి, ఆరు షట్టర్లు ఏర్పాటు చేసి దాని నుంచి దిగువన చెరువులకు నీరు వెళ్లేందుకు కాలువ ఏర్పాటు చేశారు. దీనికి పీటీ చానెల్ (పోరుమామిళ్ల-తంబళ్లపల్లె కాలువ)గా పేరు పెట్టారు. ఎక్కువైన నీటిని దిగువ సగిలేరుకు వదిలేందుకు మరో మూడు తూములు కూడా ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది నల్లమల, ప్రకాశం జిల్లాల్లో కురిసిన వర్షం నీరు నేరుగా ఎగువ సగిలేరు ప్రాజెక్టు ద్వారా వచ్చి పీటీ చానెల్ ద్వారా చెరువులకు చేరి రైతులకు మాగాణితో పాటు మెట్ట పంటలకు ఆదరువుగా ఉండేది. అంతేకాకుండా పైనున్న రాచ్చెరువు అలుగు పారినప్పుడు పలివాగు నీరు మొత్తం పీటీ చానెల్‌లో కలవడం వల్ల ఏడాదిలో ఏడెనిమిది నెలల పాటు నీరు ప్రవహించడంతో రైతులు పంటలు సాగుచేసుకునే వారు.

1996లో కొట్టుకుపోయిన ఆనకట్ట

1996వ సంవత్సరంలో ప్రకాశం జిల్లాలో భారీ వరదలు వచ్చాయి. దీంతో సగిలేరు ఉధృతంగా ప్రవహించి దిగువ తంబళ్లపల్లె వద్ద ఉన్న ఎగువ సగిలేరు ప్రాజెక్టు ఆనకట్ట కొట్టుకుపోయింది. అంతేకాకుండా మండలంలో ప్రధానమైన రాచ్చెరువు కట్ట తెగి పులివాగు నీరు మొత్తం పీటీ చానెల్‌లో కలవడంతో పలుచోట్ల కాల్వకు గండిపడింది. ప్రభుత్వం తెగిపోయిన ఆనకట్టను కాంక్రీటు నిర్మాణంతో పూర్తి చేసింది. కానీ దిగువ తంబళ్లపల్లె వద్ద ఆనకట్ట నుంచి ఉన్న పీటీ చానెల్‌ను ఏ మాత్రం పట్టించుకోలేదు.

పీటీ చానెల్‌లో గంగ కాల్వను కలిపి..

2004వ సంవత్సరం వైఎస్ ప్రభుత్వం బ్రహ్మంసాగర్ నుంచి ఎడమకాల్వ పనుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మునల్‌రెడ్డిపల్లె సమీపంలో తెలుగుగంగ కాల్వను పీటీ చానెల్ 6వ కి.మీ వద్ద కలిపి దానిని వెడల్పు చేసి లైనింగ్ పనులు చేశారు. దీని ద్వారా పెండ్లిమర్రి, ఓబులాపురం, అక్కిసిద్దుపల్లె, చింతలపల్లె, పోరుమామిళ్ల చెరువులకు తెలుగంగ జలాలు అందేవి. కానీ తెలుగుగంగ కాల్వపై ఉన్న కలసపాడు చెరువుకు మాత్రం కాల్వనీరు అందకుండా పోయింది. దీంతో కలసపాడు మండలంలోని పొలాల పక్కనే కాల్వనీరు వెళుతున్నా రైతులకు తీవ్ర నిరాశే మిగిలింది.

చెక్కుచెదరని నిర్మాణం

1896లో బ్రిటీషు ప్రభుత్వం కేవలం రాతితో చేపట్టిన నిర్మాణాలు నేటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. 1996 వరదల్లో ఆనకట్ట కొంత భాగం కొట్టుకుపోయినప్పటికీ అక్కడ ఉన్న తూములు, పలుచోట్ల కాల్వపై ఏర్పాటు చేసిన బ్రిడ్జిలు, రాచ్చెరువు నీరు దిగువ భాగానికి పారేందుకు ఏర్పాటు చేసిన ఇనుప పైపులు నేటికీ పటిష్టంగా ఉన్నాయి.

అధ్వానంగా 6 కి.మీ కాల్వ

ఎగువ సగిలేరు ప్రాజెక్టు నుంచి మునల్‌రెడ్డిపల్లె వరకు ఉన్న 6కి.మీ పీటీ చానెల్ కాల్వ అధ్వాన్నంగా మారింది. సగిలేరుకు నీరు వచ్చినా ఈ కాల్వ పూర్తిగా పూడిక, కంపచెట్లతో నిండిపోవడంతో ఇందులో నీరు పారే అవకాశం లేదు. దీని వల్ల మే, జూన్ నెలల్లో ముందస్తు వర్షాలు కురిసినప్పటికీ సగిలేరు జలాలు చెరువులకు అందని పరిస్థితి ఏర్పడింది. దీంతో దాదాపు 5వేల ఎకరాల ఆయకట్టు బీడుగా ఉండే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని కాల్వ పూడికతీత పనులు చేపట్టి లైనింగ్ ఏర్పాటు చేయాలని మండల రైతులు కోరుతున్నారు.



కంపచెట్లు, పూడికతో నిండిన పీటీ చానెల్

ఘోర రోడ్డు ప్రమాదం

● గృహ ప్రవేశానికి వెళ్తూ అనంతలోకాలకు ● ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి ● రెండు గ్రామాల్లో విషాదఛాయలు



రోడ్డుప్రమాదంలో మృతి చెందిన శ్రీనివాసులరెడ్డి కుటుంబం

కాశినాయన/మైదుకూరు రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మైదుకూరు మండలం ఎద్దోడుకనం వద్ద లారీ ఢీకొని ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృత్యువాత పడిన విషాదకర సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..

కాశినాయన మండలం చిన్నాయపల్లెకు చెందిన గుర్రాల శ్రీనివాసులరెడ్డి ఖాజీపేట మండలం తిప్పాయపల్లెలో కొన్నేళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో అత్తగారి ఊర్లో సోమవారం గృహ ప్రవేశం ఉండడంతో కుమార్తె, భార్యతో కలిసి స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై ఆదివారం సాయంత్రమే బయలుదేరాడు. కాగా మార్గమధ్యలో మైదుకూరు మండలం ముదిరెడ్డిపల్లె సమీపంలో గల ఎద్దడుకనంకు రాగానే వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వస్తున్న టిప్పర్ ప్రమాదవశాత్తు ఢీకొంది. ఈ సంఘటనలో బైకుపై ప్రయాణిస్తున్న శ్రీనివాసులరెడ్డి (35), భార్య అరుణ(32), కుమార్తె పవిత్ర(12) అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో గంట క్రితం వరకూ గ్రామంలో అందరితో కలియతిరిగిన కుటుంబం ఒక్కసారిగా మృతిచెందారన్న వార్త వినడంతో గ్రామస్తులు, బంధువులు, కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోయారు. అటు ఖాజీపేట మండలం తిప్పాయపల్లెలోనూ, ఇటు కాశినాయన మండలం చిన్నాయపల్లెలోనూ విషాదఛాయలు అలుముకున్నాయి. మైదుకూరు సీఐ సయ్యద్‌హసం సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని తెలిపారు. ఇదిలా ఉండగా మృతుడు శ్రీనివాసులరెడ్డికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు జగదీశ్వర్‌రెడ్డి తిప్పాయపల్లెలోనే విద్యనభ్యసిస్తుండగా, కుమార్తెను స్వగ్రామమైన కోడిగుడ్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ప్రమాదంలో తల్లిదండ్రి, సోదరి మృతి చెందడంతో జగదీశ్వర్‌రెడ్డి అనాథగా మిగిలాడు.


కంచిపాటివాండ్లపల్లి సమీపంలో గుట్టలో బండరాళ్ల మధ్య వేసిన లేఅవుట్

కలగానే...సొంతిల్లు !

- కొండలు, గుట్టలపై జగనన్న కాలనీలు
- లేఅవుట్లలో వసతులు కొరత
- పూర్తికాని ఇళ్ల నిర్మాణాలు..
- కొన్నింటిలో పునాదులకే పరిమితం
- కూటమి ప్రభుత్వంపై లబ్ధిదారుల ఆశలు

సుండుపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇళ్ల పేరిట చేసిన ఆర్భాటం అంతా ఇంతా కాదు. కాలనీలు కాదు. ఏకంగా ఊళ్లు నిర్మిస్తున్నామని అప్పటి పాలకులు చెప్పిన మాటలు నీటి మీద రాతలుగా మిగిలాయి. జగనన్న కాలనీ లేఅవుట్లలో రహదారులు, విద్యుత్, తాగు నీరు తదితర సదుపాయాలు కల్పించకపోవడంతో లబ్ధిదారుల సొంతింటి ఆకాంక్ష కలగానే మిగిలింది. వివరాలిలా..

సుండుపల్లె మండలంలో 22 జగనన్న కాలనీలలో లేఅవుట్లు వేశారు. మండల వ్యాప్తంగా 1,145 మంది లబ్ధిదారులకు జగనన్న పేరిట ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. వీరిలో కొంత మందికి యల్లారెడ్డిగారిపల్లె సమీపంలో ఓ రైతు మామిడి తోటలో ప్లాట్లు వేసినట్లు పేరుపైన చూపించారు. అయితే సుమారు 80 మంది ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులు అక్కడికి వెళ్లి చూస్తే అక్కడ సుమారు ఐదారు సంవత్సరాల మామిడి చెట్లు పచ్చని పంట పొలాలు దర్శనమిస్తున్నాయి. ఇదంతా గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన నాయకుల మాటలు విని స్థానిక రైతులను ఇబ్బంది పెట్టేందుకు అప్పటి అధి కారులు చేసినట్లు ఆ తర్వాత అధికారులు గుర్తించారు. అక్కడ ఇంటి నిర్మాణానికి అనువు కాదని మరో చోట ఇస్తామని చెప్పారు. అక్కడ ప్లాట్లు కేటాయించిన లబ్ధిదారులకు ఇంటి స్థలం చూపించలేదు. ఆ లబ్ధిదారులు తమకు పట్టాలిచ్చారు కానీ స్థలం చూపి ంచలేదని అధికారులు దగ్గరికి వెళితే పట్టించుకునే వారే లేరని వాపోతున్నారు. వేరేచోట ఎక్కడైనా ఇంటి స్థలాలు చూపిస్తే ఇంటి నిర్మాణం చేసుకుంటామని చెబుతున్నారు. అలాగే సుండుపల్లెలోని


అక్కంపల్లి జగనన్న కాలనీలో మట్టి రోడ్డు

మైనార్టీలు ఇతర నిరుపేదలైన లబ్ధిదారులకు ఊరికి దూరంగా గుట్టల్లో బండలపైన లేఅవుట్లు వేసి పట్టాలు పంపిణీ చేశారు. ఇక్కడి విలువైన స్థలాలను వైసీపీ నాయకులు తమ అనుచరులకు ఇతరులకు అమ్ముకున్నారని విమర్శలు ఉన్నాయి. ఇక మాచిరెడ్డిగారిపల్లె, చిన్నగొల్లపల్లె, పొలిమేరఎల్లె గ్రామ పంచా యతీల్లో ఇంటి స్థలాల పంపిణీ జరగలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా అర్హులను గుర్తించి ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గృహ నిర్మాణాలపై కలెక్టర్ ఆరా...

రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పేదల ఇళ్ల నిర్మాణ పనులపై దృష్టి పెట్టింది. నాలుగు రోజుల క్రితం కలెక్టర్ సుండుపల్లె మండలంలో పర్యటించారు. గృహ నిర్మాణాల పురోగతి, మౌలిక వసతులు తదితర అంశాలపై ఆరాతీశారు. ఇంటి నిర్మాణ పనుల వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఇంటి నిర్మాణాలు పూర్తి చేసేందుకు మూడు నెలలు గడువు పెట్టారు. ఇప్పటికీ రెండు నెలలు ముగిసినా పనుల్లో పెద్దగా పురోగతి లేదు. అప్పట్లో ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు కేటాయించారు. ఇంటి సామాగ్రి ధరలు పెరగడంతో ఇంటి నిర్మాణం భారంగా మారిందని లబ్ధిదారులు చెబు తున్నారు. దీంతో కొందరు మాత్రమే సొంత డబ్బుతో కొన్ని కుటుంబాలు మాత్రం నిర్మాణాలు పూర్తి చేసుకుని నివాసం ఉంటున్నాయి. వసతులు లేకపోవడంతో వీరికి తిప్పలు తప్పడం లేదు. రోడ్లు, సరైన నీటి వసతి లేదు. చాలా లేఅవుట్లలో అసలు ఇంటి నిర్మాణాలే ప్రారంభం కాలేదు. గుట్టల్లో, అడవి ప్రాంతం సమీపంలో, బండలపైన లేఅవుట్లు వేయడంతో లబ్ధిదారులు పునాదులు కూడా వేయలేదు.

స్థలం చూపించలేదు



జగనన్న ఇంటి స్థలం పేరిట పట్టా ఇచ్చారు. స్థలం చూపించడం లేదు. పట్టాలు ఇచ్చి మూడు సంవత్సరాలు అయ్యింది. ఇంటి స్థలం మాత్రం చూపించడం లేదు. స్థలం చూపిస్తే ఇంటి నిర్మాణం చేసుకుంటాను. అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. ఈ ప్రభుత్వంలోనైనా న్యాయం చేయాలి.

- నిర్మలమ్మ, వినాయకనగర్

ఇంటి స్థలం ఇప్పించండి



గత ప్రభుత్వంలో ఇంటి పట్టాలు ఇచ్చి ఇప్పటికీ స్థలం చూపించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ ప్రభు త్వంలోనైనా ఇంటి స్థలం చూపించండి. ఇంటి నిర్మాణం చేసుకుంటాము. స్థలం చూపించకుండా పట్టాలిచ్చి మాలాంటి నిరుపేదలను వైసీపీ ప్రభు త్వం మోసం చేసింది.

-నాగరాణి, సుండుపల్లె

30 లోపు దరఖాస్తు చేసుకోవాలి



స్థలం ఉండి పక్కా గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులు ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఇంటి స్థలాల కోసం ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, రేషన్ కార్డు, మొబైల్ నెంబర్ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ దగ్గర ఇచ్చి దరఖాస్తు చేసుకోవాలి. సందేహాలు ఉంటే 8309070813 ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేయండి

-నాగరాజునాయక్, హౌసింగ్ ఏఈ

ఫీజుల చెల్లింపుపై ఒత్తిడి తెస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫీజుల చెల్లింపు విషయంలో విద్యార్థులపై ఒత్తిడి తెస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ కళాశాల యాజమాన్యాలను హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫీజురీయింబర్స్‌మెంటు సమస్యల కారణంగా హాల్‌టికెట్లు నిరాకరించడం, తరగతులకు లేదా ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకాకుండా నిరోదించడం చేయకూడదని తెలిపారు. ఇప్పటికే అన్ని కళాశాలలకు జీవో నోట్ కూడా పంపించామని, జిల్లాలోని పలు విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి ఫీజులు చెల్లించాలని వత్తిడి తేవడమే కాకుండా హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఇదే విషయంపై రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ తీవ్రంగా పరిగణించిందన్నారు. ప్రభుత్వ ఆదేశాలు ఉల్లంఘిస్తే సంబంధిత విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాఠశాలల సమయం పెంపు సరికాదు : ఏపీటీఎఫ్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాలల సమయాన్ని పెంచడం సరికాదని ఏపీటీఎఫ్‌రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.శ్యాంసుందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం కడప నగరం ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలో ప్రతి మండలంలో ఒకఉన్నత పాఠశాలను ఎంపిక చేసి ఉదయం 9 నుంచి 5 వరకు పాఠశాలలు నిర్వహించేలా.. ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం సరైంది కాదన్నారు. ఉపాధ్యాయులపై పని వత్తిడి తగ్గించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కౌన్సిలరు భాస్కర్‌రెడ్డి, జిల్లా కౌన్సిలర్లు రాజారావు పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి


కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం నూతన జేఏసీ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు లెక్చరర్లకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం జేఏసీ ఛైర్మన్ జానీబాబు డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ కాంట్రాక్టు లెక్చరర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్లుగా పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలపై చర్చించారు. అనంతరం నూతన జేఏసీని ఎంపిక చేశారు. జిల్లా జేఏసీ ఛైర్మన్‌గా జానీబాబు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. అలాగే సభ్యులుగా శివరామిరెడ్డి,హరిప్రసాద్‌రెడ్డి, రాధాక్రిష్ణ, అనీష్, సుబ్బయ్య, అమృతాదేవి, రామ్మోహన్‌రెడ్డి, ఇర్ఫాన్, శ్రీనివాసులు, రామలక్ష్మి నాగేంద్ర, ఫక్రుద్దీన్, మధుశ్రీనివాస్, మల్లేశ్వరి తదితరులను ఎంపిక చేశారు.

'గురువుల పాలిట గుదిబండగా బోధనేతర పనులు'

కడప ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ టీచర్ల పాలిట గుదిబండగా మారిన బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాదరెడ్డి తెలిపారు. ఆదివారం కడప నగరం నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా అధ్యక్షతన జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజుల తరబడి శిక్షణలు, ప్రతిరోజూ రకరకాల యాప్‌ల నిర్వహణతో బోధన ఎలా సజావుగా సాగుతుందో ఆలోచించాలన్నారు. బడిలో అడుగు పెట్టినప్పటి నుంచి టీచర్ల హాజరు, విద్యార్థుల హాజరు, ఆయాల హాజరు రకరకాల యాప్‌లతో అప్‌లోడ్ చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. అనంతరం రాష్ట్రఅసోసియేట్ అధ్యక్షుడు సురేశ్‌బాబు ప్రసంగించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, రమణారెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, సంగమేశ్వర్‌రెడ్డి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్ తెగిపడి 16 పందులు మృతి


విద్యుత్ వైరు తెగిపడి మృతి చెందిన పందుల వద్ద యజమానులు, ప్రమాదానికి కారణమైన విద్యుత్‌తీగ

రాయచోటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మెయిన్ లైన్ విద్యుత్ వైర్ తెగిపడి 16 పందులు మృతి చెందిన సంఘటన రాయచోటి పట్టణంలో ఆదివారం సాయంత్రం జరిగింది. బాధితుల వివరాల మేరకు.. రాయచోటి పట్టణ పరిధిలోని చిత్తూరు రోడ్డులో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా విద్యుత్ వైరు తెగి పడింది. దీంతో ఆ ప్రాంతంలో మేత మేస్తున్న 16 పందులు అక్కడికక్కడే మృతి చెందాయి. అయితే ఆ సమయంలో అక్కడ మనుషులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా మృతి చెందిన పందుల విలువ సుమారు రూ.5లక్షల వరకు ఉంటుందని పందుల యజమానులు పెద్ద పోలేరయ్య, శ్రీరాములు, సుంకయ్యలు లబోదిబోమంటున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగిందని. .. అధికారులు విచారించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి



చెన్నూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కిరాయపల్లెకు చెందిన డల్లాయి సుధాకర్ (60) కుటుంబ సభ్యులు మందలించారనే మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుధాకర్ స్థానికంగా వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కుటుంబ పోషణార్థం ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యేవాడు. ఈనేపథ్యంలో కుటుంబ సభ్యులు అతని ప్రవర్తనపై మందలించడంతో అవమానంగా భావించి.. శనివారం రాత్రి 10.30 గంటల సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కొందరు 108 వాహనంతో రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉద యం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నబీకోటలో ఫ్యానుకు ఉరివేసుకుని..

కడప క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం నబీకోటలో ఆదివారం ఓ వ్యక్తి ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తాలుకా పోలీసుల వివరాల మేరకు.. వల్లూరు మండలం గోటూరు గ్రామానికి చెందిన రాజశేఖర్ (29) వాహన డ్రైవరుగా పనిచేస్తూ భార్యతో కలిసి కడప నబీకోటలో నివాసం ఉంటున్నాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు ఉండేవి. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్ మార్చురీకి తరలించారు. కాగా రాజశేఖర్ మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ మృతుని సోదరుడు పాలెంపల్లె లక్ష్మినారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వేముల, నవంబరు 24: మండలంలోని భూమయ్యగారిపల్లె క్రాస్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. భూమయ్యగారిపల్లెకు చెందిన గోటూరు రామాంజనేయులు, గోటూరు ఎర్రన్నలు పులివెందుల నుంచి స్వగ్రామానికి ఎక్సెల్ మోటర్ సైకిల్‌పై వెళ్తున్నారు. గ్రామానికి వెళ్లే క్రాస్ వద్దకు రాగానే కడప రూట్ నుంచి వచ్చిన కారు వేగంగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిద్దరిని అదే కారులో పులివెందులలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

నందలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లతిమ్మాయపల్లె గ్రామానికి చెందిన రామిశెట్టి సుబ్బరాయుడు(54) గ్రామ సమీపంలోని చెయ్యేరు ఈత ఆడుతుండగా ప్రమాదవశాత్తు నీటి మునిగిపోయాడు. ఆ ప్రదేశానికి ఈతకు వెళ్లిన కొందరు గమనించి.. అతన్ని బయటకు తీసి 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి డాక్టర్లు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. నందలూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'అంతర్జాతీయ స్థాయికి చేరిన జగన్ అవినీతి'


పార్టీలో చేరిన వారితో బీటెక్ రవి

లింగాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి అంతర్జాతీయ స్థాయికి చేరి ఏకంగా అమెరికాలో కూడా కేసు నమోదు అయ్యే పరిస్థితి ఏర్పడిందని టీడీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. మండలంలోని కామసముద్రం గ్రామంలో ఆదివారం 40కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. గ్రామ సర్పంచు వెంకటనారాయణరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, భానుప్రకాష్ రెడ్డి, రామాంజనేయరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులకు బీటెక్ రవి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోజు అంతర్జాతీయస్థాయిలో ఆంధ్రప్రదేశ్ పరువు పోయేలా జగన్‌మోహన్‌రెడ్డి వ్యవహారశైలి ఉందన్నారు. ఎంపీ అవినాష్‌రెడ్డి బెయిల్‌రద్దు అయ్యే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అవినాష్‌రెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు ఇవ్వడం, సోషల్ మీడియాలో అసభ్యపోస్టులు పెడుతూ కేసుల్లో ఉన్న వర్రా రవీంద్రారెడ్డి, అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి సర్వేనెబర్ 260/1, 260/2లో అటవీ ప్రాంత భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారని, అలాగే తెలంగాణ వ్యక్తి నుంచి కార్లు బాడుగకు తెచ్చుకొని తర్వాత తిరిగి ఇవ్వకుండా అవినాష్‌రెడ్డి మనుషులు బెదిరిస్తూ కార్లను సొంతం చేసుకున్నారని వివరించారు. ఇవన్నీ చూసి ప్రజలు ఇలాంటి వారినా ఎంపీగా, ఎమ్మెల్యేగా ఎన్నుకున్నామంటూ అసహ్యించు కుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, టీడీపీ మండల నాయకుడు సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ చెస్ సంయుక్త విజేతలుగా అశ్రసుభాని, మల్లేశ్వరరావు


సంయుక్త విజేతలకు బహుమతులను అందిస్తున్న దృశ్యం

కడప స్పోర్ట్స్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక బెల్లంమండీ వీధిలో గల ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన ఏపీ స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ విభాగ పోటీలలో కడప నగరానికి చెందిన అశ్ర సుభాని, విజయవాడకు చెందిన సీనియర్ కె. మల్లేశ్వరరావు సంయుక్త విజేతలుగా నిలిచారు. పోటీలో వీరిద్దరూ ఏడు రౌండ్లకు గాను 6.5 పాయింట్లు సాధించారు. దీంతో నిర్వాహకులు ఇద్దరిని సంయుక్త విజేతలుగా ప్రకటించారు. ఏపీ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.సత్యనారాయణ విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పలువురు చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయి విజేతగా ఉమ్మడి కడప జిల్లా జట్టు


జాతీయస్థాయి ఎంపికైన ఉమ్మడి కడప జిల్లా జట్టు

రాయచోటిటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా అరగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 22, 23, 24వ తేదీల్లో జరిగిన 68వ రాష్ట్రస్థాయి అండర్-14 సాఫ్ట్ బాల్ బాలుర విభాగం పోటీల్లో ఉమ్మడి కడప జిల్లా బాలుర జట్టు విజేతగా నిలిచింది. తొలుత కృష్ణ, ప్రకాశం జిల్లా జట్లపై గెలిచి పూల్ విన్నర్‌గా నిలిచింది. అలాగే క్వార్టర్స్ ఫైనల్స్‌లో శ్రీకాకుళం జట్టుపైన, సెమీ ఫైనల్‌లో ఆతిధ్య చిత్తూరు జిల్లాపై, ఫైనల్‌లో విజయన గరం జిల్లా జట్టుపై వరుసగా విజయాలు సాధించుకుంటూ రాష్ట్రస్థాయి విజేతగా నిలిచింది.

జాతీయ స్థాయికి క్రీడాకారుల ఎంపిక : ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన రాయచోటి పట్టణంలోని మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వెంకటేశు, భవంత్‌సాగర్, సుండుపల్లెకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అభి, రెడ్డివారిపల్లెకు చెందిన రాజేశ్‌లు జాతీయస్థాయి జట్టుకు ఎంపికయ్యారు. వీరు జనవరిలో మహారాష్ట్రలో జరగబోయే పోటీల్లో పాల్గొంటారు. అలాగే బాలికల విభాగంలో ఉమ్మడి కడప జిల్లా జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. వారిలో జాతీయ జట్టుకు అనూష, లక్ష్మిప్రసన్న, సన్నీలు ఎంపికైనట్లు మాసాపేట హైస్కూల్ పీడీ జగదీశ్వరయ్య తెలియజేశారు.

హోరాహోరీగా సాగిన ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ పోటీలు

ఈస్ట్ గోదావరి, రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్, రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్ల విజయం


మహేంద్రారెడ్డి (95 పరుగులు), అభినవ్ (83 పరుగులు)

కడప స్పోర్ట్స్, నవంబర్ 24, (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-23 మెన్స్ ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా ఆదివారం ఈస్ట్ గోదావరి జట్టు, రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టుపై 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. మరో మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ జట్టు, అనంతపురం జట్టుపై 3 వికెట్లతో విజయం సాధించగా.. రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు ప్రకాశం జట్టుపై 4 వికెట్ల తేడాతో విజయకేతనం ఎగురవేసింది. వివరాలిలా..


కేఓఆర్ఎం మైదానంలోఈస్ట్ గోదావరి-రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్ జట్టు 38.5 ఓవర్లలో 164 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇందులో సాయిపూర్ణతేజ 62 పరుగులు చేశారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన ఈస్ట్ గోదావరి జట్టు 41.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి విజయానికి అవసరమైన 165 పరుగులు సాధించారు. ఇందులో సూర్యచైతన్య 43, విజయ్ 41 పరుగులు చేశారు. దీంతో ఈస్ట్‌గోదావరి జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో అనంతపురం-రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన అనంతపురం జట్టు బ్యాటింగ్‌కు దిగి 49.2 ఓవర్లలో 216 పరుగులు చేసింది. ఇందులో మహేంద్రారెడ్డి 95 పరుగులు చేసి నాటౌట్‌గా క్రీజులో నిలిచారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ జట్టు 46.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 217పరుగులు సాధించింది ఇందులో సుబ్రహ్మణ్యం 73 పరుగులు, శశాంక్ శ్రీవాత్స్ 52 పరుగులు చేసి గెలుపులో కీలక పాత్ర పోషించారు. దీంతో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు 3 వికెట్ల తేడాతో గెలుపొందింది. కేఎస్ఆర్ఎం మైదానంలో ప్రకాశం-రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో ప్రకాశం జట్టు 46.5 ఓవర్లలో 224 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇందులో అభినవ్ 83 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ 42.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 225 పరుగులు చేసింది. ఇందులో ఖాజామోహిద్దీన్ 72 పరుగులు, సమన్విత్ 57 పరుగులు చేసి నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు 4 వికెట్ల తేడాతో గెలుపు సాధించింది.

కొండ గుహలో దాగిన గవిమల్లేశ్వరుడు


● గుహలో సహజ సిద్ధంగా కొలువైన దేవతాప్రతిమలు



గుహకు వెలుపల కొలువుదీరి పూజలందుకుంటున్న గవిమల్లేశ్వరుడు







పైన శివలింగం, కింద తామరపుష్పం... శ్వేతనాగు ఆకారం... పుట్టపై పడుతున్న నీటిబొట్టు



గుహలో కొలువైన దుర్గాదేవి, పక్కన గవిమల్లేశ్వరుడు, అమ్మవారి ముందు కనిపిస్తున్న శ్రీచక్రం



శేషతల్పం



మోకాళ్లపై గుహలోకి వెళ్లి వస్తున్న భక్తుడు

వేంపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కొండగుహలో దుర్గాదేవి సమేత గవిమల్లేశ్వరుడు కొలువై ఉన్నాడు. వేంపల్లెలోని పవిత్ర పాపాఘ్ని నదీ ఒడ్డున ఈ ఆలయ వెలసి ఉంది. పాపాఘ్ని నదిలో స్నానమాచరించి ఒడ్డున కొండగుహలో ఉన్న దుర్గాదేవి గవిమల్లేశ్వరస్వామిని దర్శించుకుంటే అంతా మంచి జరుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ ఆలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకోవాలంటే గుహలో మోకాళ్లపై నడుచుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. అప్పట్లో ఈప్రాంతాన్ని పరిపాలిస్తున్న జనమేజయుడు రాజు సహకారంతో గుహలో దుర్గాదేవిని రౌద్రరూపంలో ప్రతిష్ఠించి తపస్సు చేసేవారంటారు. అమ్మవారి పక్కనే గవిమల్లేశ్వరుడిని ప్రతిష్ఠించి పూజలు చేసేవారు. శ్రీచక్రం తాకి అమ్మవారిని దర్శించుకుంటే అమ్మవారు శాంతిస్వరూపిణిగా దర్శనమిస్తుందని పూజారి ప్రసాదరావు తెలిపారు. గుహలోపలికి వెళ్లలేని భక్తుల కోసం కొండ కిందనే స్వామివారి మరో శివలింగాన్ని ప్రతిష్ఠించారు.

కార్తీక మాసంలో లక్షదీపారాధన

గవిమల్లేశ్వరుడిని ఎక్కువగా సోమ, శనివారాల్లో చాలా మంది భక్తులు దర్శించుకుంటారు. కార్తీక మాసంలో ప్రతి సోమవారం ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహిస్తారు. కార్తీక పౌర్ణమి రోజున లక్షదీపారాధన నిర్వహిస్తారు. జ్వాలా తోరణం, ప్రత్యేక పూజలు చేస్తారు. గత 50 సంవత్సరాలకు పైగా బాలిశెట్టి వంశీయులు ఆలయ పాలన చూస్తున్నారు.

గుహలో కొలువైన దేవతాప్రతిమలు

గవిమల్లేశ్వర స్వామి ఆలయం లోపలికి వెళ్లాక ఒక పెద్ద గుహ కనిపిస్తుంది. అక్కడ సహజసిద్ధంగా ఏర్పడిన దేవతామూర్తుల ప్రతిమలు దర్శనమిస్తాయి. పైన శివలింగం, కిందివైపున తామరపుష్పం కనిపిస్తుంది. మరో చోట నాగశేషకల్పం దర్శనమిస్తుంది. శ్వేతనాగు ఆకారంలో ఎప్పటికి చుక్కచుక్క నీరు కారుతూ శంఖు కింద పుట్ట ఆకారం కనిపించడం విశేషం.

ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలి

గవిమల్లేశ్వర ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలి. మూడేళ్ల క్రితం వచ్చిన భారీ వరదల కారణంగా ఆలయం ముందు వరకు కోతకు గురై పెద్ద గొయ్యిలు ఏర్పడ్డాయి. ముందుభాగమంతా మట్టితో నింపి రోడ్డు ఏర్పాటుచేస్తే ఆలయం ముందు సువిశాల స్థలం ఏర్పడుతుంది. ఇందుకోసం అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని భక్తులు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రత

చక్రాయపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని చక్రాయపేట పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్‌నాయక్ పేర్కొన్నారు. ఆదివారం సురభి వైద్యశాల ఆధ్వర్యంలో వేంకటేశ్వర, రాచరాయ ఆలయ పుర వీధులలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఉప సర్పంచు, మెడికల్‌స్టోర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

భవిష్యత్తు పట్ల అవగాహన పెంపొందించడమే లక్ష్యం

పులివెందుల రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు భవిష్యత్తు పట్ల అవగాహన పెంపొందించడమే బాలోత్సవ కమిటీ లక్ష్యమని నిర్వాహకుడు, జిల్లా పరిశ్రమల శాఖ రిటైర్డ్ అధికారి జి.గోపాల్ పేర్కొన్నారు. ఆదివారం కడప బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో చిత్రావతి చిత్రలేఖన పోటీ ఉత్సవాలు-2024లో భాగంగా పులివెందుల పట్టణం అహోబిలాపురం మెయిన్ స్కూల్‌లో 'మా కుటుంబం, 'పర్యావరణ పరిరక్షణ' అనే అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు.

ఆందోళనను జయప్రదం చేయాలి



బైకు ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 26న కడపలో నిర్వహించనున్న ఆందోళనను జయప్రదం చేయాలని ఆదివారం ఏఐటీయూసీ, సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం కడప నగరంలో బైకు ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి బైకు ర్యాలీ ప్రారంభించి కోటిరెడ్డిసర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, అప్సర సర్కిల్, క్రిష్ణసర్కిల్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్‌కు చేరుకున్నారు. సీపీఐ కడప నగర కార్యదర్శి ఎస్.వెంకట శివ,ఏఐటీయూసీ కడప నగర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, అంగన్వాడీ వర్కర్లు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రతిభను గుర్తించడం అభినందనీయం



పాకా సురేశ్‌ను సత్కరిస్తున్న పద్మశాలీయ సంఘం నేతలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతిభను గుర్తించడం అభినందనీయని కార్పొరేటర్ పాకా సురేశ్ పేర్కొన్నారు. ఆదివారం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన కార్యక్రమాన్ని పద్మశాలీ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం తరఫున ప్రతి సంవత్సరం ప్రతిభావంతులైన విద్యార్థులకు పురస్కారాలు అందించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం గౌరవాధ్యక్షుడు అవ్వారు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

జిల్లా కార్యవర్గం ఏర్పాటు

కడప(వినాయకనగర్), నవంబరు24(ఆంధ్రజ్యోతి): స్థానిక యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా బాబునాయక్, సహాధ్యక్షుడిగా డాక్టర్ మధుసూదన్, రామక్రిష్ణ, బాలసుబ్బయ్య, శ్రీనివాసులు, రమేశ్‌తో సహా 15 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ నాయకుడు కొండయ్య, అధ్యక్షుడు పీవీ రమణ, సహాధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఎదురవుతున్న సమస్యలపై సంఘం పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, నాగ భూషణం, బంజారా సంఘం నాయకలు శివానాయక్, పీఆర్‌టీ నాయకులు తిరుపాల్ తదతరులు పాల్గొన్నారు.

ఎకరాకు పరిహారం రూ.30 లక్షలు ఇవ్వండి



హైవే రోడ్డుకు భూములు కోల్పోతున్న రైతులతో చర్చిస్తున్న తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి

వేంపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె ప్రాంతంలో రోడ్డు పక్కన ఎకరా భూమి రూ.4కోట్ల వరకు పలుకుతోంది. పాపాఘ్ని నదీ పక్కన హైవేరోడ్డుకు భూములు కోల్పోతున్న రైతులకు కనీసం రూ.30 లక్షలు ఇవ్వాలని టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డి, మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వల్లి, తహసీల్దార్ హరినాథ్‌రెడ్డిని కోరారు. హైవే రోడ్డులో భూములు కోల్పోతున్న యజమానులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. మార్కెట్ విలువ ప్రకారం మూడు రెట్ల ధరతో రైతులకు చెల్లిస్తామని తహసీల్దార్ వివరించగా రెండు విభాగాలుగా కేటాయించి రాజుకాలువ ప్రాంతంలో ఎకరాకు రూ.25లక్షలు, మిగిలిన చోట ఎకరాకు రూ.30 లక్షలు ఇవ్వాలని టీడీపీ నాయకులు కోరారు. జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత వరకు రైతులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

వేంపల్లె,నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ శిబిరానికి అశోక్‌కుమార్ సతీమణి కొప్పరపు నాగసుధామణి రూ.50వేలు సాయం అందించారు. అశోక్‌కుమార్ ఆవోపాను ప్రారంభించగా ఆయన జ్ఞాపకార్థం ఈమొత్తాన్ని అందించారు. డాక్టర్ శేషపాణి రోగులను పరీక్షించి మందులు అందించారు. 85 మంది వైద్యం చేయించుకున్నారు.

'బిల్లులు ఇచ్చినా రోడ్డు పనులు ఎందుకు చేయలేదు'



మాట్లాడుతున్న టీడీపీ మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్

వేంపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో రోడ్డు పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌కు పెండింగ్‌లో ఉన్న దాదాపు రూ.10కోట్లు బిల్లులు కూటమి ప్రభుత్వం చెల్లించి మూడు నెలలు కావస్తున్నా పనులు ఎందుకు చేపట్టలేదని టీడీపీ మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్ ఆర్‌అండ్‌బీ అధికారులను, కాంట్రాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డిని ప్రశ్నించారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన బిల్లులను టీడీపీ ప్రభుత్వం ఇచ్చినప్పటికి ఇంకా పనులు చేయకపోవడం వల్ల ప్రజల్లో టీడీపీ ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందన్నారు. ఆర్ అండ్‌బీ ఎస్ఈ జోక్యం చేసుకొని వేంపల్లెలో పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను వెంటనే ప్రారంభించేలా చేయాలని కోరారు. టీడీపీ రైతు విభాగ రాష్ట్ర నాయకుడు జగన్నాథరెడ్డి, గ్రంథాలయ మాజీచైర్మన్ బాలస్వామిరెడ్డి, మైనార్టీ నాయకులు మహబూబ్ షరీఫ్, బీసీ నాయకులు గోటూరు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కొండ చిలువ కలకలం



కొండ చిలువను పట్టుకున్న రెడ్డిశేఖర్

వల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి):భాకరాపురం గ్రామంలో శనివారం సాయంత్రం కొండ చిలువ కలకలం రేపింది. స్థానిక గ్రామానికి చెందిన రెడ్డిశేఖర్ అనే వ్యక్తి ఇంటి వెనుక భాగంలో ఉన్న గడ్డివామి వద్ద కొండ చిలువ ఉండడాన్ని గమనించిన కొందరు అతనికి తెలియజేయడంతో అతను దాన్ని చాకచక్యంగా పట్టుకుని వంకలో వదిలాడు.

ఘనంగా అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవం



పూలతో పూజలు అందుకుంటున్న అయ్యప్పస్వామి

కమలాపురం రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దచెప్పలి గ్రామంలో వెలసిన అయ్యప్పస్వామి దేవస్థానం మూడో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయ చైర్మన్ దినేష్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గురుస్వామి బలరామ్ పర్యవేక్షణలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, గణపతి నవగ్రహ శాంతిహోమం నిర్వహించారు. అనంతరం అయ్యప్ప మాలధారులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సొంత నిధులతో రోడ్డు ఏర్పాటు



రామలింగయ్య కాలనీలో రోడ్డు పనులు చేయిస్తున్న జయరామిరెడ్డి

వేంపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె రామలింగయ్య కాలనీలో గుంతలుగా ఉన్న పలు వీధుల్లో టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సింగారెడ్డి జయరామిరెడ్డి సొంత నిధులతో రోడ్డు వేయిస్తున్నారు. ఆదివారం ఆ వీధుల్లో ట్రాక్టర్లతో మట్టిని తరలించారు. ఇటీవల ఆ కాలనీకి చెందిన టీడీపీ నాయకులు పఠాన్ షేర్‌ఖాన్ రోడ్డు సమస్యను జయరామిరెడ్డి కృషికి తీసుకొచ్చారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా వెంటనే పనులు మొదలుపెట్టడం పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు జయచంద్రారెడ్డి, శివకృష్ణారెడ్డి, జయశంకర్‌రెడ్డి, ఆదిత్యరెడ్డి తదితరులు దగ్గరుండి రోడ్డు పనులు చేయిస్తున్నారు.

అనాథలను అక్కున చేర్చుకోవడం అభినందనీయం

వేంపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అనాథలను ఆదరిస్తుండడం అభినందనీయమని రాజీవ్‌కాలనీ అనాథ వృద్ధాశ్రమ నిర్వాహకుడు వెంకటసుబ్బయ్య సేవలు అభినందనీయమని మాజీ ఎంపీటీసీ సభ్యుడు జీవీ రమణ, ఎస్ఐ తిరుపాల్‌నాయక్, మానవతా సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి తెలిపారు. రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న అనాథ శరణాలయానికి అమ్మ అనాథ వృద్ధుల శరణాలయంగా పేరు పెట్టారు. సేవలు చేస్తున్న వెంకటసుబ్బయ్యను శాలువ, పూలమాలలతో సత్కరించారు. కేక్‌కట్ చేసి వృద్ధులకు పంచిపెట్టారు. అనంతరం ఎస్ఐ తిరుపాల్‌నాయక్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి, నాయకులు, ఆశ్రమ నిర్వాహకుడు వెంకటసుబ్బయ్యను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవత ప్రతనిధులు బాలాజి, శ్రావణ్‌కుమార్, తేజ, యోగీశ్వర్, రాజారామ్, గంగాధర్‌రెడ్డి, పోతిరెడ్డి శివ, తదితరులు పాల్గొన్నారు.

పెద్ద దర్గాను సందర్శించిన కన్నా లక్ష్మీనారాయణ



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

కడప కల్చరల్, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): కడప పెద్ద దర్గాను ఆదివారం తెలుగుదేశం పార్టీ సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ దర్శించుకున్నారు. కడపలో ఓ ప్రయివేటు కార్యక్రమానికి వచ్చిన ఆయన సాయంత్రం పెద్ద దర్గా చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు, అనుగుణంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: డాక్టర్



వినయ్‌కుమార్‌రెడ్డి, వైద్యుడు నందిమండలం ఆరోగ్య కేంద్రం

ఫటాఫట్

పెండ్లిమర్రి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధుల పట్ల అవగాహన పెంపొందించుకొని తగు జాగ్రత్తలు వహించాలని నందిమండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు వినయ్‌కుమార్‌రెడి అన్నారు. ఆంధ్రజ్యోతి ఫటాఫట్ ఇంటర్వ్యూలో ఆయన ఆ వివరాలు తెలియజేశారు.

ప్రశ్న: గ్రామాలలో వైరల్ ఫీవర్ ఎక్కువగా ఉంది? నివారణ కోసం తీసుకోవాల్సిన చర్యలేవి?

జవాబు: వైరల్ ఫీవర్ ఉన్న వారికి దగ్గు, జలుబు, గొంతునొప్పి ఎక్కువగా ఉంటోంది. ఈ వైరల్ ఫీవర్ అనేది ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందుతుంది. మాట్లాడేటప్పుడు నోటి తుంపర్ల వల్ల ఇది మరొకరికి వ్యాప్తి చెందుతుంది. వైరల్ ఫీవర్ ఉన్నప్పుడు మాస్క్ ధరించడంతో పాటు, సామాజిక దూరం పాటించాలి. వాతావరణం చల్లగా ఉంది కాబట్టి చల్లని నీరు తాగకుండా, చల్లగా ఉండే తినుబండారాలు తినకుండా, వేడి నీరు, వేడిగా ఉండే తినుబండారాలు తినడ వల్ల తొందరగా తగ్గిపోతుంది.

ప్రశ్న: డెంగ్యూ, మలేరియా వ్యాధులపై ప్రజలకు మీరిచ్చే సలహాలు ఏమిటి?

జవాబు: డెంగ్యూ, మలేరియా జ్వరాలు దోమల ద్వారా వ్యాప్తి చెందుతాయి. ఈ కేసులు మండలంలో తక్కువ నమోదు అయ్యాయి. దోమల లార్వాను తొలగించడం ద్వారా, గ్రామాలలోని ఇళ్ల వద్ద ఉన్న నీటి కుంటల్లో ఆయిల్ బాల్స్ వేయడం వల్ల అక్కడ ఉన్న దోమల లార్వాను నిర్మూలించవచ్చు.అలాగే వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం, నీటి ట్యాంకులను శుభ్రపరచడం ఇలాంటి నివారణ చర్యలు చేపట్టాలి. గ్రామాల్లోకి ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు వెళ్లి పరిసరాలను పరిశీలించి ఆహార పదార్థాలపై మూతలు, తాగునీటి కుండలపై మూతలు వేయించాలి. ఈ విషయాన్ని పల్లె ప్రజలకు తెలియజేయడం వల్ల డెంగ్యూ, మలేరియా జ్వరాలను అరికట్టవచ్చు.

ప్రశ్న: ఆసుపత్రిలో మందుల కొరత ఏమైనా ఉందా?

జవాబు: ఆరోగ్య కేంద్రం పరిధిలో మందుల కొరత లేదు. పాము, కుక్కకాటు మందులు కూడా అందుబాటులో ఉన్నాయి. ఈ మధ్యకాలంలో కుక్కకాటు కేసులు చాలా వస్తున్నాయి. ట్రీట్‌మెంట్ చేసి వ్యాక్సిన్ ఇవ్వడంతో పాటు పల్లెల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

ప్రశ్న: గర్భిణులకు వైద్యసేవలు ఎలా అందుతున్నాయి.

జవాబు: ప్రతినెలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సుమారు 40 మంది గర్భిణుల పేర్లు నమోదు అవుతున్నాయి. నెలలో 9వ తేదీ ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ పథకం ద్వారా పరీక్షలు చేస్తున్నాం. వారికి కావాల్సిన మందులు, టీకాలు, వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. ఆసుపత్రిలో సిబ్బంది కొరత లేదు. ముగ్గురు నర్సులు, ఒక ఫార్మసిస్టు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఇద్దరు డాక్టర్లు ఉన్నారు. వైద్య సిబ్బంది రోజూ గ్రామాలలో అందుబాటులో ఉండి వైద్యంతో పాటు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

తొగటవీర క్షత్రియులు రాజకీయంగా ఎదగాలి

● కదిరి ఎమ్మెల్యే వెంకట ప్రసాద్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తొగటవీరక్షత్రియులు రాజకీయంగా ఎదగాలని కదిరి ఎమ్మెల్యే గంజికుంట వెంకటప్రసాద్ తెలిపారు. ఆదివారం కనుమలోపల్లె మహాశివలింగేశ్వరస్వామి సన్నిధిలో తొగట వీరక్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తొగట వీర క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని, అందులో జిల్లాకు చెందినవారిని కూడా భాగస్వామ్యం కల్పిస్తామన్నారు. నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కళ్యా సుధాకర్, పల్లా నరసింహారావు మాట్లాడారు. మహిళా అధ్యక్షురాలు ఎస్.శ్రీలత, రాయలసీమ అధ్యక్షుడు బొమ్మల వెంకటరత్నం, జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, నగర వర్కింగ్ ప్రెసిడెంటు సుబ్రమణ్యం, కోశాధికారి సుదర్శన్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు పల్లా మురళిక్రిష్ణయ్య, ఉపాధ్యక్షుడు చౌడం సూరిబాబుతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆంగ్లేయుల పాలిట సింహస్వప్నం నరసింహారెడ్డి

వేంపల్లె, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆంగ్లేయుల పాలిట సింహస్వప్నంలా ఉయ్యాలవాడ నరసిహారెడ్డి నిలిచారని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి కొనియాడారు. ఆదివారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతిని కాంగ్రెస్ నాయకులు వేంపల్లెలో ఘనంగా నిర్వహించారు.

వ్యర్థాల తొలగింపు



చిత్రం చెప్పిన సమస్యకు పరిష్కారం

కాల్వలో వ్యర్థాలు తొలగించి బ్లీచింగ్ చల్లుతున్న దృశ్యం

చెన్నూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : చిత్రం చెప్పిన సమస్యకు పరిష్కారం లభించింది. చెన్నూరు హైవే రహదారి నుంచి బుడ్డాయపల్లెకు వెళ్లే క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఆంజనేయస్వామి గుడి ముందు పేరుకుపోయిన వ్యర్థాలపై ఆదివారం ఆంధ్రజ్యోతిలో 'చిత్రం చెప్పిన సమస్య' పేరుతో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి అక్కడి వ్యర్థాలను తొలగింపజేసి బ్లీచింగ్ చల్లించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో అక్కడ కాంక్రీటు కాల్వతో పాటు చిన్నపాటి మోరీ కూడా ఏర్పాటు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

1న లక్షార్చన మహోత్సవం

12న అయ్యప్పస్వామి గ్రామోత్సవం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెన్నాతీరం అయ్యప్పస్వామి ఆలయంలో డిసెంబరు 1న లక్షార్చన మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు స్వామి అయ్యప్పసేవా సంఘం అధ్యక్షుడు కొవ్వూరు రమేష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆలయంలో లక్షార్చన మహోత్సవం ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లగా భక్తులు, దాతల సహకారంతో లక్షార్చన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. మధ్యాహ్నం 30 వేల మంది భక్తులకు అన్నప్రసాద వినియోగం చేస్తామని తెలిపారు. లక్షార్చన మహోత్సవంలో ఐదు వేల మంది అయ్యప్ప దీక్షదారులు పాల్గొంటారన్నారు. అన్నప్రసాద వినియోగానికి మహిళలకు, అయ్యప్ప స్వామి దీక్షా దారులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. లక్షార్చన మహోత్సవంలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. లక్షార్చనలో భాగంగా 16వ తేదీ ప్రారంభమైన మండల పూజ 26వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. డిసెంబరు 12వ తేదీ గురువారం అయ్యప్పస్వామి గ్రామోత్సవం పురవీధుల్లో కన్నుల పండువగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో టీటీడీ మాజీ సభ్యుడు టంగుటూరు మారుతీప్రసాద్, స్వామి అయ్యప్పసేవా సంఘం గౌరవాధ్యక్షుడు నామా రమేష్‌బాబు, ఉపాధ్యక్షుడు రాంవెంకటనారాయణ, కోశాధికారి వినోద్‌కుమార్, సహాయ కార్యదర్శులు నందకిశోర్, సుధీర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రాహ్మణ కార్తీక ధాత్రి సమారాధన



శివలింగానికి పూజలు చేస్తున్న పండితులు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో బ్రాహ్మణ కార్తీక ధాత్రి సమారాధన ఘనంగా నిర్వహించారు. ఆదివారం పెన్నా తీరంలోని కొవ్వూరు వృద్ధాశ్రమం కల్యాణ మండపంలో కార్యక్రమం నిర్వహించారు. శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. మహిళలు, పిల్లలకు కోలాటం, పాటల పోటీలు చిన్నారులకు విచిత్ర వేషధారణ నిర్వహించారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనం అనంతరం విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కంబగిరిరావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో దూప, దీప, నైవేద్యాలకు ఇస్తున్న ఖర్చును టీడీపీ కూటమి ప్రభుత్వం రూ.10 వేలకు పెంచడం హర్షణీయమని బ్రాహ్మణ సేవా సంఘం పట్టణాధ్యక్షుడు రామగోపాలశర్మ, కార్యదర్శి మధురభారతుల శ్రీహరి కిశోరశర్మ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం నంగనూరుపల్లెలో కార్తీక వనభోజనంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం చాగంటి కోటేశ్వరరావుకు విద్యార్థుల నైతిక విలువల సలహాదారుడిగా నియమించి గౌరవించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం కోశాధికారి సూర్యప్రకాశ శర్మ, మచ్చేంద్రనాధ్, చంద్రశేఖరశర్మ, రామమోహన్, మంజునాథశర్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్పస్వామి గ్రామోత్సవం

ఖాజీపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారి పూసల కొట్టాలు సమీపంలో వెలసిన అయ్యప్పస్వామి గ్రామోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించనున్నారు. గ్రామోత్సవం సందర్భంగా ఆలయంలో ఉదయం 5 గంటలకు మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం, 7.15 గంటలకు గణపతిపూజ, 8.30 గంటలకు ఉత్సవ మూర్తులకు అభిషేకం, 10 గంటలకు గణపతి, సుబ్రమణ్యం, నవగ్రహాలకు పూజలు, మధ్యాహ్నం 12 గంటలకు మహాపూర్ణాహుతి, 12.30 గంటలకు అన్నదానం, ఒంటి గంటకు అయ్యప్పస్వామి ప్రధాన కలశం లక్కీడ్రా, సాయంత్రం మూడు గంటల నుంచీ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహిస్తారన్నారు. దీపోత్సవంలో పాల్గొనే మహిళలకు ఆలయ కమిటీనే అన్ని ఏర్పాట్లు చేయడం, కన్నెస్వాములకు కూడా కావాల్సిన సామగ్రిని ఆలయ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు కమిటీ చైర్మన్ పత్తి కృష్ణారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని భక్తులందరు విరివిగా పాల్గొని గ్రామోత్సవాన్ని విజయవంతం చేయాలని, ఆలయ గురుస్వాములు పాల్గొని భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఊరేగింపులో మహిళలు కోలాటం నిర్వహించనున్నారు.

పసిడిపురిలో వేదస్వరం



సైకత లింగానికి నిర్వహించిన బిల్వార్చన

కన్నుల పండువగా భద్రావతి భావన్నారాయణస్వామి కల్యాణం

నగరేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం ● ముక్తిరామలింగేశ్వరుడికి దశ సహస్ర బిల్వార్చన

పట్టణంలో వేడుకగా బిందెసేవ మహోత్సవం

కార్తీక మాసంలో పసిడిపురి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. పట్టణంలో ఎటు చూసినా వేద మంత్రాలే విన్పించాయి. రామేశ్వరం తిరుణాళ్ల, పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో భద్రావతి భావన్నారాయణస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ముక్తి రామలింగేశ్వరస్వామి ఆలయంలో దశ సహస్ర బిల్వార్చన ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో నగరేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. చౌడేశ్వరీదేవి జ్యోతుల ఉత్సవాల్లో భాగంగా బిందెసేవ మహోత్సవం వేడుకగా నిర్వహించారు. వివరాల్లోకెళితే....

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో భద్రావతి భావన్నారాయణస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం మహాశివునికి భద్రావతి, భావన్నారాయణస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం భద్రావతి, భావన్నారాయణస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేశారు. వేద పండితులు సుముహూర్తంలో స్వామివారి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. దొరసానిపల్లె రోడ్డులోని భద్రావతి భావన్నారాయణస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు.

దశ సహస్ర బిల్వార్చన

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా రామేశ్వరంలోని ముక్తి రామలింగేశ్వరస్వామి ఆలయంలో దశ సహస్ర బిల్వార్చన ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం శ్రీరామచంద్రుడు ప్రతిష్ఠిత సైకత లింగానికి పంచామృతాభిషేకం, రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. ఆలయ చైర్మన్ మార్తల రాజారెడ్డి మాట్లాడుతూ సోమవారం రామేశ్వరం తిరుణాళ్ల సందర్భంగా మధ్యాహ్నం అన్నదానం, రాత్రికి కుంకుమార్చన, మహిళల కోలాటం, కర్రసాము, స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నగరేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో నగరేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆదివారం వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం వాసవీ దేవి ఉద్యానవనంలో పార్వతీసమేత నగరేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేశారు. వేద పండితులు స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. 102 మంది సుహాసినులు పసుపు, కుంకుమలతో స్వామి వారిని అర్చించి దీపాలు వెలిగించి మొక్కుకున్నారు. అమ్మవారికి అష్టోత్తర శతనామార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్‌రావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బిందెసేవ మహోత్సవం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చౌడేశ్వరీదేవి జ్యోతుల ఉత్సవాల్లో భాగంగా బిందెసేవ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని చౌడేశ్వరీదేవి ఆలయాలను జ్యోతి ఉత్సవాల కోసం ప్రత్యేకంగా అలంకరించారు. రామేశ్వరం, దేవాంగపేట, శ్రీరాంనగర్ ప్రాంతాల్లో బిందెసేవ మహోత్సవాన్ని నిర్వహించారు.

వైభవంగా జ్యోతి మహోత్సవాలు

ప్రొద్దుటూరు ,నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక మాసంలో చౌడేశ్వరిదేవి జ్యోతి మహోత్సవాలు ఆదివారం వాడవాడలా వైభవంగా జరుగుతున్నాయి. పట్టణంలోని సుబ్బిరెడ్డి కొట్టాల రామేశ్వరం వెంకటేశ్వర్ల పేట శ్రీరాంనగర్ వినాయకనగర్ మేదరవీధి తదితర ప్రాంతాల్లో చౌడేశ్వరి ఆలయాల్లో చౌడేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామలింగచౌడేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఉట్టి నాగశయనం ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మేదర వీధినుంచి ఊరేగించారు. రాత్రి భక్తులు తలపై జ్యోతులను పెట్టుకుని తెల్లవార్లు ఆడించారు.



భద్రావతి భవన్నారాయణస్వామి కల్యాణం



నగరేశ్వరస్వామి కల్యాణం



బిందెసేవ మహోత్సవం

కార్తీక వన భోజన మహోత్సవం



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పోరుమామిళ్ల, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): వాసవీ కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆర్యవైశ్యులు చెరువు కట్టపై ఉన్న భైరవస్వామిని దర్శించుకుని రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం భోజన ఏర్పాట్లు చేశారు. మహిళా సంఘం నేతలు పాల్గొన్నారు. ఆదివారం కావడంతో చెరువు కట్ట ఆవరణమంతా భక్తులతో నిండిపోయింది.

సుభాన్ కుటుంబాన్ని ఆదుకుంటాం

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి

మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్



మహబూబ్ సుభాన్‌బాషా కుటుంబానికి లక్ష నగదు అందించిన డీఎస్పీ రాజేంద్రప్రసాద్

పోరుమామిళ్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల కానిస్టేబుల్ మహబూబ్ సుభాన్ బాషా ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడని, ఆయన కుటుంబాన్ని ఆదుకుంటామని మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. కానిస్టేబుల్ సుభాన్ అనారోగ్యంతో బెంగళూరులో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదివారం అతని పార్థివదేహాన్ని పోరుమామిళ్లకు తీసుకునివచ్చి పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడి కుటుంబానికి డీఎస్పీ లక్ష రూపాయలు నగదు అందించారు. ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, వైసీపీ నేతలు నల్లేరు విశ్వనాథరెడ్డి, రమణారెడ్డి తదితర నేతలు పాల్గొని నివాళులర్పించి ఆ కుటుంబానికి సానుభూతి తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు డిగ్రీ విద్యార్థి అభిషేక్ ఎంపిక

పోరుమామిళ్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి అభిషేక్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శామ్యూల్ డేవిడ్‌రాజ్, వైస్‌ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రావు, అధ్యాపక బృందం అతన్ని అభినందించారు.

తెల్లపాడు - పోరుమామిళ్ల బస్సు ఏర్పాటు

పోరుమామిళ్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల నుంచి తెల్లపాడుకు బస్సు ఏర్పాటు చేశారు. రెండురోజుల కిందట కలెక్టరు తెల్లపాడులో నిర్వహించిన పల్లెనిద్రలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువనేత రితీష్‌కుమార్‌రెడ్డి బస్సు సౌకర్యం విషయం ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన బస్సు సౌకర్యం కలిగేలా నిర్ణయం తీసుకున్నారు.

సంస్థల తరలింపు దారుణం

జమ్మలమడుగు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న ప్రభుత్వ సంస్థలను అమరావతికి తరలించడం దారుణమని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ అన్నారు. ఆదివారం ఎన్జీవో హోంలో విలేకరులతో మాట్లాడుతూ సీమలోని ప్రధాన కార్యాలయాలను రాష్ట్ర ప్రభుత్వం అమరావతికి తరలించడానికి సన్నాహాలు చేస్తోందన్నారు. కడప కొప్పర్తిలో ఉన్న ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాలను తరలించడం మానుకోవాలన్నారు. పట్టణ సహాయ కార్యదర్శి మహేష్‌యాదవ్, సుభాన్ పాల్గొన్నారు.

అనాథలకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు కప్పుతున్న దృశ్యం

బద్వేలుటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారులు, బస్టాండుల్లో ఉన్న అనాథలకు ఆదివారం వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. వివేకానంద ఫౌండేషన్ సంస్థ రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ అనాథలు చలి నుంచి స్వాంతన చేకూర్చేందుకు దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. ఎలాంటి ఆదరణ లేకపోతే ఆశ్రమంలో ఉచితంగానే ఆశ్రయం కల్పించి సేవలు అందిస్తామని అనాథలకు భరోసా ఇచ్చారు. వివేకానంద ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు వెంకటసురేష్, శ్రీనాథ్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అనాథలను కాపాడుదాం

పోరుమామిళ్ల , నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అనాధలను చలి నుంచి కాపాడుదామని వివేకానంద ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు పి.రామక్రిష్ణారెడ్డి అన్నారు. శనివారం అర్ధరాత్రి ఆయన పోరుమామిళ్లలో నల్లమల జ్యోతి క్షేత్రంలో ఉన్న అనాదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.



ఆనందంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



కడపలో కలిసిన 1985-86సంవత్సరం పూర్వవిద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): 38 ఏళ్ల తరువాత సహచరులు, స్నేహితులను కలవడం ఎంతో ఆనందంగా ఉందని అసిస్టెంటు కమిషనరు (జీఎస్టీ) మధుసూదనరెడ్డి, ఎన్‌ఆర్‌ఐ సుధాకర్‌రెడ్డి అన్నారు. పోరుమామిళ్ల జడ్పీహైస్కూల్‌లో 1985-86లో టెన్త్ చదివిన విద్యార్థులు ఆదివారం కడపలోని ఓ ఫంక్షన్ హాలులో సమావేశం అయ్యారు. చాలా ఏళ్ల తరువాత ఇలా అందరినీ కలవడం ఎంతో సంతోషం కలిగిస్తోందన్నారు. బాల్యం చిలిపి చేష్టలు, అల్లర్లు మననం చేసుకున్నారు. ఒక్కసారిగా 38 ఏళ్ల వెనక్కి వెళ్లి ఏమేం చేసుకున్నారో గుర్తు చేసుకుని చిన్నపిల్లల్లా మారి ఆనంద డోలికల్లో తేలియాడారు. ఏటా నవంబరులో పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించాలని ఈ సారి పోరుమామిళ్లలో కలిసేలా ప్రణాళికలు రూపొందించుకున్నారు. రంతుల్లా, గౌస్‌పీర్, అనసూయ, నాగరాజు, నరేంద్రనాథరెడ్డి తోటి మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా 'ఉయ్యాలవాడ' జయంతి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతిని రేనాటి సూర్యచంద్రుల సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కొర్రపాడు రోడ్డులోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ స్వరూప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పరాయిపాలనలో మగ్గుతున్న భారతీయుల్లో ఆత్మస్థైర్యం నింపడానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కృషి చేశారన్నారు. టీటీడీ మాజీ సభ్యుడు టంగుటూరు మారుతీప్రసాద్, కోట ఓబుళరెడ్డి, మురళీనాథరెడ్డి, బసిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, రామచంద్రారెడ్డి, గజ్జెల వెంకటేశ్వర్‌రెడ్డి, దస్తగిరి, వెడవలి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అదానీని అరెస్టు చేయాలి

జమ్మలమడుగు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆదానిని అరెస్టు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి యేసుదాసు, కమిటీ సభ్యులు విజయ్ డిమాండ్ చేశారు. పాత బస్టాండు గాంధీ విగ్రహం వద్ద సీపీఎం నేతలు నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఆదానితో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవాలని రాష్ట్రంలో వారికి ఇచ్చిన భూములను వెనక్కు తీసుకోవాలని ప్రజల సంపదను కాపాడాలని కోరారు. గౌతమ్ ఆదాని ఆర్థిక నేరాలను అమెరికా న్యాయశాఖ బయటపెట్టిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు మైఖేల్, రాజేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా శివభక్తేంద్రుడి ఆరాధన

ఖాజీపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బంగ్లా సమీపంలో శివభక్తేంద్రస్వామి 30వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు స్వామివారికి పూజలు నిర్వహించారు. గణపతిపూజ, అఖండ దీపారాధన, శివభక్తేంద్ర స్వామివారికి ప్రత్యేక పూజలు, ప్రసన్నలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, శివభక్తేంద్రునికి పాలాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. అశోక్ బృందం వారిచే కోలాటం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కమిటీ చైర్మన్ ఆదినారాయణరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా గౌరీదేవి గ్రామోత్సవం

జమ్మలమడుగు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆదివారం సాయంత్రం 3 గంటల నుంచి ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో గౌరీదేవి గ్రామోత్సవం జరిగింది. 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు రోజూ ఉదయం, సాయంత్రం మెయిన్‌బజార్‌లోని శ్రీమురహరి లింగమూర్తి కల్యాణ మండపంలో గౌరీదేవి వ్రత పూజలు ఘనంగా జరిగాయి. ఆదివారం సాయంత్రం ముగింపు చేశారు. ఈ మేరకు పట్టణంలో గౌరీదేవి గ్రామోత్సవం వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి దేవాలయం వద్ద నుంచి పాత బస్టాండు మీదుగా మెరవణి నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని గ్రామోత్సవం వెంట పూజలు చేసి మొక్కుకున్నారు. కార్యక్రమంలో కార్యనిర్వాహకులు నూకల పెద్ద కుళాయి, కేకేపల్లె గంగాధర్, మల్లెంకొండు సుబ్రమణ్యం, శ్రీవాసవీ ఆర్యవైశ్య మహిళా మండలివారు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

కొండాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): భవనకార్మికులు, ఆశావర్కర్లు తదితర కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను అవలంబిస్తోందన్నారు. గండికోట ముంపువాసులకు వెంటనే పరిహారం ఇవ్వాలని, భూములు కోల్పోయిన వారికి భూములు ఇవ్వాలని జిల్లా ఉపాధ్యక్షుడు చాంద్‌బాషా కోరారు. 26న కేంద్రప్రభుత్వ వ్యతిరేక విధానాలపై కడపలో జరిగే ర్యాలీ, ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఏఐటీయూసీ, సీపీఐ నేతలు వెంకటరమణ, మనోహర్‌బాబు, బహదూర్, సుబ్బారావు, ప్రసాద్, తారాదేవి, జయమ్మ, రాధా, వరలక్ష్మి పాల్గొన్నారు.



'హైందవ శంఖారావం'ను విజయవంతం చేయండి

బ్రహ్మంగారిమఠం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'హైందవ శంఖారావం' సభను జయప్రదం చేయాలని ప్రొద్దుటూరు డివిజన్ సహాయ కార్యదర్శి సుధాకర్ పిలుపునిచ్చారు. పరిషత్ ప్రొద్దుటూరు డివిజన్ ఆధ్వర్యంలో యోగివేమన రెడ్ల అన్నదాన సంఘం సత్రంలో ఎత్తపు గుర్విరెడ్డి అధ్యక్షతన చేపట్టిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ దేవాలయాలు తాము నిర్వహించుకునే స్వతంత్రత హిందువులకు నేటికీ రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ దేవాలయాలను స్వయం ప్రతిపత్తి కలిగిన ఉత్తమ ధార్మిక వ్యవస్థకు అప్పగిస్తూ వెంటనే చట్టసవరణ చేయాలని విశ్వహిందూ పరిషత్ ఒక జాతి ఉద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. హిందువుల మనోభావాలు, సమస్యలను అర్థం చేసుకుని ప్రభుత్వాలు స్పందించాలన్న లక్ష్యంతో విజయవాడలో జనవరి 5న చేపట్టే హైందవ శంఖారావం బహిరంగసభకు లక్షలాది మంది పాల్గొన్నారు. శంఖారావానికి మద్దతు పలికేందుకు 9240015333కు మిస్డ్ కాల్ ఇస్తే పేరు నమోదు చేస్తామన్నారు. విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు యత్తపు గుర్విరెడ్డి, ధర్మ ప్రచారక్ వై.శ్రీను, ధర్మరక్షక్ బాలగురయ్య, భజన మండలి నిర్వాహకులు ధర్మిశెట్టి రమణయ్య, ఏకలవ్య ఫౌండేషన్ సష్టాంగ్ సాధక్ చిన్నయ్య, గ్రామ ప్రముఖ్ పరంధామయ్య, గ్రామ సహాయ ప్రముఖ్ అబ్బిరెడ్డి ఉపాధ్యాయులు నారాయణస్వామి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శాంతి సమాజ స్థాపనే మానవత లక్ష్యం

ఎర్రగుంట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్షీణిస్తున్న మానవత విలువలను పెంపొందించి, సమాజంలో శాంతి స్థాపనే లక్ష్యంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పనిచేస్తోందని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఎర్రగుంట్ల మానవత యూనిట్ పర్యవేక్షణలో ప్రొద్దుటూరు మోక్షిత్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో డాక్టర్ భూపాల్ రెడ్డి నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరాన్ని కమిషనర్ శేషఫణితో కలిసి ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రజల అవసరాలను గుర్తించి సంస్థ సహాయ సహకారాలను అందిస్తోందన్నారు. రాష్ట్ర స్థాయిలో ఆపన్నులకు ఇప్పటికే సేవలందిస్తూ మానవత సంస్థ అగ్రగామిగా ఉందన్నారు. కమిషనర్ మాట్లాడుతూ మానవతకు తన సహకారం ఎప్పటికీ ఉంటుందని సభ్యత్వం స్వీకరించారు.

విద్యార్థుల పర్యవేక్షణలో మొక్కలు

బద్వేలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పర్యవేక్షణలో రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో మొక్కలు నాటారు. ఆదివారం స్థానిక కళాశాల ఆవరణలో ఎన్‌సీసీ, నేవీ ఎయిర్‌వింగ్ విద్యార్థుల పర్యవేక్షణలో మొక్కలు నాటారు. కళాశాల పరిపాలనాధికారి వెంకట సాయిక్రిష్ణ మాట్లాడుతూ చక్కటి వాతావరణం, ఆరోగ్యకరమైన గాలి వంటివి భవిష్యత్తు తరాలకు ఉండాలంటే ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి రక్షించాలని భవిష్యత్తు తరాలకు మనమిచ్చే నిజమైన ఆస్తి అన్నారు. ప్రిన్సిపాల్ సత్యనారాయణ, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.